నేరాలను కనిపెట్టే యంత్రం!

ఎమ్.వి.వి. సత్యనారాయణ

ఆలోచనలతో నా మెదడు వేడెక్కిపోతోంది.

డబ్బు సంపాదన నా తలలో తిష్ట వేసుకూర్చుంది. ఏ వ్యాపారమూ నాకు అచ్చిరాలేదు. ఉద్యోగ ప్రయత్నం చేద్దామంటే నాకు చదువు అబ్బలేదు. చూస్తూ చూస్తూ నౌఖరు వుద్యోగానికి వెళ్ళలేను. మా నాన్న నాకు ఇచ్చిపోయిన నాలుగు వేల రూపాయలతో ఏం చేయాలన్నా కుదిరి చావడంలేదు.

అందుకే ఒక పెద్దమనిషి సహకారంతో పిస్తోలు కొనుక్కోగలిగాను. పేపర్లో ప్రకటన వేశాను. స్థానిక పోస్టాఫీసులో బాక్స్ నెంబర్ అద్దెకు తీసుకున్నాను.

"హత్యలు జరగాలా? సంప్రదించండి!

పోస్టు బాక్సు నెంబర్ 316,

తిమ్మాపురం."

నా ప్రకటన దినపత్రికలలో స్పష్టంగానే వచ్చింది. అయితే తెలుగు పాఠకులమీద నా ప్రయోగం సరి

కొత్తది. వాళ్ళకు ఒకపట్టాన కొరుకుడు పడివుండదు.

ఉదయాన్నే లేవడం ఎంత సహజమో, రోజూ నేను పోస్టాఫీసుకు వెళ్ళి నా బాక్స్ తెరచి చూసుకోవడం కూడా అంత సహజమైపోయింది.

పదిహేను రోజులు కనుకుంటాను. నా బాక్స్ పలికింది. నా బాక్స్‌లో తెల్లటి కవర్ ఒకటి ముప్పయిఅయిదు పైసల స్టాంపు అతికించి పడవేసివుంది. ఆ కవరే నా ప్రయత్నాలకు ఊపిరిపోసింది. ఆత్రుతగా కవర్ తెరచి చూశాను. కవరులో తెల్లకాగితం వుంది. ఆ కాగితం మీద మూడేమూడు వాక్యాలు!

"ఎవరిని హత్య చేస్తారు? ఎలా చేస్తారు? కేవలం హాబీగానా? పారితోషికం కావాలా? మీ ఉద్దేశ్యం ఒక కవర్‌లో రాసి రైల్వేస్టేషన్ ముందున్న పోస్టుబాక్సు స్టాండ్ కింద పెట్టండి. రేపు ఉదయం 11 గంటలకు!

—ఆకాశరామన్న."

నవ్వుకున్నాను. నేనే పిరికి సన్నాసి ననుకున్నాను. నాకంటె పిరికివాళ్ళు ఈ ప్రపంచంలో వున్నారన్న మాట!

అంతలోనే నాకు మరో విషయం గుర్తు వచ్చింది. హత్యల సందర్భం వచ్చినప్పుడు ఎంతటి ధైర్యశాలి అయినా గప్‌చిప్‌గా వుండిపోతాడు. హిచ్‌కాక్ చిత్రాలలో భయంకర హంతకులనూ శవాలనూ చూడ గలడు కాని నిజ జీవితంలో ఒక్క శవాన్ని కూడా చూడలేడు.

ఆలోచనలు కట్టిపెట్టి జవాబు రాయసాగాను.

"ఆకాశరామన్నగారూ!

హాబీకోసం హత్యలు చేయను. పారితోషికం కావాలి.

ఒక్కొక్క హత్యకూ పదివేలు కావాలి. హత్యకాబోయే వాళ్ళ అడ్రసు, హత్యలు జరగవలసిన స్థలం, చెక్కుతో సంప్రదించండి. హత్యజరిగాకనే చెక్కును కాష్‌చేస్తాను. చెక్కు కాంష్ కాకపోతే మీ ఉత్తరం, చెక్కు పోలీసులకు అందుతాయి.

—పోస్టుబాక్ 316."

ఉత్తరం మడిచి కవరులోపెట్టి అతికించాను. టాక్సీని పిలిచాను. యెక్కి కూర్చున్నాను. వాచీ చూసుకున్నాను. పదకొండు కావటానికి యింకా పావుగంట సమయం వుంది.

టాక్సీ స్టేషన్‌ముందు ఆగింది. రైళ్ళు వచ్చేపోయే సమయంకాదు. నిర్జనంగా వుంది. ఒక బిచ్చగాడు కాబోలు స్పృహలేకుండా నిద్రపోతున్నాడు.

టాక్సీని పంపేశాను. ఉత్తరాన్ని పోస్టుబాక్స్‌క్రింద పెట్టాను. ఆకాశరామన్న చాటునుండి నన్ను గమనిస్తోనే ఉండివుంటాడు. నేను వెలుగులోకి రావడంవలన నష్టం లేదు. నేరం జరిగినట్లు ఆకాశరామన్న నన్ను పట్టించబోతే మొదట నష్టపోయేది ఎక్కువగా అతడే!

నాకేం? నేను తెగించు కూర్చున్నాను.

చకచకా నడిచివెళ్ళి న్యూకోలనీకి మలుపు తిరిగాను.

ఆ సాయంకాలమే నా బాక్స్‌లో మరో ఉత్తరం వుంది. ఉత్తరంతో బాటు పదివేలకు చెక్కుంది. చెక్కును చూడగానే నాకు కళ్ళు తిరిగాయి. అవి అన్నీ రూపాయలా? పైసలా? రూ 10,000/—అనేవుంది. పేరు రాయవలసినచోట ఖాళీగా వుంది.

ఉత్తరం చదవసాగాను.

"మీరు హత్యచేయవలసింది లక్ష్మీపతిని. రైల్వే

స్టేషన్ ప్రాంతాల్లోనే. రేపు గోదావరి ఎక్స్‌ప్రెస్సులో దిగుతాడు. ఎ.పి.ఎస్ 9505 అంబాసిడర్‌లో స్టేషన్ ఆవరణలోంచి బయటికి వస్తాడు.

—శ్రీపతి (ఆకాశరామన్న.)"

నా మనసు ఆనందంతో వురకలు వేస్తోంది. నా ఆలోచనలు ఆచరణలోకి వస్తున్నాయి. పని జరగకుండానే పదివేలు నా పరమాయాయి. నా చేతిలో మొదటి హత్య జరగవలసిన సమయం రేపు వుదయం 5-30 కీ 5-40 కీ మధ్య. గోదావరి ఈ మధ్య ఖచ్చితంగానే వస్తోంది.

లక్ష్మీపతి!

మనిషి యెవరో తెలియదు—అతడి చావు తన చేతిలో వుంది. చిత్రం! లక్ష్మీపతి ఎక్కడ వుంటాడో, ఎక్కడ పెరుగుతున్నాడో కానీ అతడి చావు తనకు పదివేలు ముట్టచెబుతోంది. లక్ష్మీపతి ఎవరైతే నాకేం? శ్రీపతికి అతడి చావు వలన పదిలక్షలు కలిసిరావచ్చును. కలవనియ్యి. తనకేం?

ఆలోచనలు కట్టిపెట్టి యింటికి వెళ్ళాను. తాళం తెరచి నా గదిలోకి ప్రవేశించాను. నా యిల్లు ఒంటరిగా బోసిపోతోంది. నాకో తోడు కావాలి. నా ఆలోచనలూ ప్రవృత్తులూ ఆమెకు నచ్చాలి. ఆమెది నాకు లాగా నేర ప్రవృత్తి కారాదు. నేర ప్రవృత్తితో అలసిపోయిన నన్ను సేదదీర్చాలి! నా పాపిష్టి సొమ్మును ఆమె సార్థకంగా కాక నా కోసం సమర్థవంతంగా ఖర్చుపెట్టాలి.

2

రైల్వేస్టేషన్ పెళ్ళివారి యిల్లులాగా వుంది. భారతదేశ జనాభాకి ప్రతీకలుగా అనేక భాషలవాళ్ళు కలకల

లాడుతూ తిరుగుతున్నారు. వాచీలో సమయం ఉదయం అయిదూ ముప్ఫయి చూపుతోంది.

గోదావరి ఎక్స్‌ప్రెస్ అయిదు నిమిషాల్లో వస్తోందిట.

జేబులోని పిస్తోలును తడుముకున్నాడు. ఆరు బుల్లెట్లు లోడ్ చేసి వుండటంతో పిస్తోలు బరువుగా వుంది. దూరంగా ఎక్స్‌ప్రెస్ వస్తోన్న శబ్దమయింది. నేను చకచక బయటకు నడిచాను.

నా కారు స్టేషన్ వెలుపల చెట్టు క్రింద ఆపి వుంచాను. అద్దెకు తెచ్చినకారు అది! కారు యెక్కి కూర్చున్నాను.

పార్కింగ్ ప్లేస్‌లో నాకు కావలసిన అంబాసిడర్ కారు వుంది. ఆ కారును చూస్తోంటే జాలివేస్తోంది. కొన్ని నిముషాలలో ఆ కారు ఒక శవాన్ని భరించవలసి వస్తుంది.

అన్నట్టు కారు తెచ్చి అక్కడ పెట్టిన డ్రయివర్ యెవరో....యెవరయితే తనకేం? తాను లక్ష్మీపతిని చంపకుండా డ్రయివర్ ఆపలేడు. ఆ కారు తెచ్చి పెట్టింది శ్రీపతి మాత్రం కాదు. లక్ష్మీపతి చావువలన శ్రీపతికి లాభం వుంది. అందువలన లక్ష్మీపతి హత్యజరిగితే చేయవలసిన మోటివ్ శ్రీపతికే వుంది. శ్రీపతి ప్రస్తుతం బలిష్టమైన ఎలిబీలో వుంటాడు.

హంతకుడు యెవరయిందీ రుజువుకాదు.

నేను తెరవెనకే వుంటాను. శ్రీపతీ అంతే! తేలు కుట్టిన దొంగ!

ప్లాట్ ఫాంమీదకు గోదావరి వచ్చి ఆగినట్టుంది.

ఎ.పి.యస్ 9605 అంబాసిడర్ మీదనే దృష్టి నిలిపాను. ప్రయాణికులు వస్తున్నారు. అటూయిటూ

పరుగులు తీస్తున్నారు.

లావుపాటి వ్యక్తి అంబాసిడర్ కారును సమీపించాడు. అతడి వెనుక అందమైన యువతి వస్తోంది. ఆమె చేతిలో వి.ఐ.పి. సూట్ కేసు వుంది. లావుపాటి వ్యక్తి కారును సమీపించాడు. ఆమె అటునుండి సూట్ కేస్ను వెనుక డోర్ లోంచి కారులోవుంచి ముందు డోర్ లోంచి కారు ఎక్కి కూర్చుంది.

అతడి వీపు నాకు తిన్నగావుంది.

నేను చటుక్కున పిస్తోలుతీశాను. రెండో జేబులోంచి సైలెన్సర్ తీసి పిస్తోలుకు అమర్చాను. నన్ను యెవరూ గమనించడంలేదు. అంబాసిడర్ కారు నాకు ముప్ఫయి అడుగుల దూరంలో వుంది.

అతడు ముందుకు వంగి డోర్ తెరవబోతున్నాడు.

క్లచ్ తొక్కి కారును స్టార్టుచేశాను. ఇంజన్ రొద పెడుతోంది. సైలెన్సర్ లోంచి వచ్చే కొద్దిపాటి శబ్దమూ ఇంజన్ శబ్దం మింగుతోంది. చుట్టూచూచి పిస్తోలును గురి పెట్టాను. అతడు డోర్ తెరచి లోపలకు అడుగుపెట్ట బోతున్నాడు.

'లక్ష్మీపతీ!' గొణిగాను. సేఫ్టీ కాచ్ తప్పించాను.

కన్నుమూసి రేంజ్ చూసుకున్నాను. ట్రిగ్గర్ నొక్కాను. 'సర్'మని చిన్న శబ్దం!

లక్ష్మీపతి దెబ్బతిన్న కుందేలుపిల్లలాగా కారులోకి దబ్బున పడ్డాడు. వీపుమీద రక్తం చిమ్ముతోండగా నా కారు వేగంగా కదిలింది. కారులోని అందమైన యువతి కళ్ళు తెరచుకుని ఆశ్చర్యంగా చూస్తోన్నాయి.

నా కారు న్యూకోలనికి మరలింది.

3

శాంత కెవ్వున అరుస్తోంది. ఆమెకు మొహమంతా చెమటలుపట్టి ధారలుగా కారుతోన్నాయి. తండ్రికి ఏం జరిగిందో, ఆయన కారులోకి యెలా తుళ్ళిపడ్డాడో ఆమెకు తెలియడంలేదు. తండ్రి వీపులోంచి రక్తం కారుతోంది. రెండు కొళాయి గొట్టాలు తెగినట్లు రక్తం రెండు ధారలుగా కారుతోంది.

"నాన్నా!" ఏడుస్తోంది శాంత.

లక్ష్మీపతిలో కదలిక లేదు.

అంబాసిడర్ కారుచుట్టూ జనం మూగుతున్నారు. వాళ్ళలో హాహాకారాలు చెలరేగుతున్నాయి.

"ఏమయింది?"

"అరరె! రక్తం, దారి యివ్వండి!"

"ఇంక దారి ఏమిటి?"

"ఏం?"

"పిస్తోలుతో కాల్చినట్టున్నారు."

"ప్రాణాలు పోయినట్టేనా?"

"సందేహం లేదు."

"అయితే పోలీసులకు చెప్పండి....ఆడకూతురు...."

ఎవరో ఫోన్ చేసినట్టున్నారు.

పోలీసులు వచ్చేసరికి శాంత స్పృహలేకుండా సీటు మీద పడిపోయివుంది. లక్ష్మీపతి శవం సీటుకీ డాష్‌బోర్డుకీ మధ్యలో పడివుంది.

పోలీసులు శవాన్ని అంబులెన్స్‌లోకి ఎక్కించారు.

ఆసుపత్రిలో శాంత స్పృహలోకి వచ్చింది.

పోలీసులు శవాన్ని మార్చురీలో ఒప్పగించారు. క్రైంబ్రాంచికి తరలింది కేసు. క్రైంబ్రాంచ్ ఇన్స

పెక్టర్ శాంతను వెంటపెట్టుకుని ఆమె యింటికి వెళ్లాడు.

శ్రీపతి అప్పటికి ఇంకా నిద్రమంచంమీదే వున్నాడు.

ఇన్స్పెక్టర్ అతడిని నిద్రలేపాడు. శాంత అర చేతులలో మొహం కప్పుకుని కూర్చుంది.

"శాంత తండ్రి లక్ష్మీపతి మీకు ఏమవుతారు?" అడిగాడు ఇన్స్పెక్టర్.

"ఎందుకు సార్? నాకు అన్నయ్య అయినా తండ్రి అయినా ఆయన ఒక్కడే!" అన్నాడు శ్రీపతి.

"మీ అన్నయ్యగారికి శాంత ఒక్కతే కూతురు. అవునా?"

"అవును సార్! ఈ ప్రశ్నలన్నీ యెందుకు అడుగుతున్నారు?"

"మీ అన్నయ్యను యెవరో తుపాకీతో కాల్చి చంపారు?"

శ్రీపతి దిగ్గున లేచాడు.

"మీరనేది నిజమా?"

"అవును."

"శాంతా!" శ్రీపతి చటుక్కున శాంతవైపు కదిలాడు. ఆమెను పొదివి పట్టుకున్నాడు.

శాంత బోరున ఏడుస్తోంది.

"మీ అన్నగారిని చంపవలసిన అవసరం ఎవరికి వుంది?"

"ఆయన మంచివాడు! యెవరికీ అపకారంచేసే వ్యక్తి కాదు."

"ఆయన చనిపోతే ఆయన ఆస్తి కూడా మీకే వొస్తుందా?"

"ప్లీజ్!....ఇప్పుడు ఆస్తుల ప్రసక్తి...."

"ఆ స్తికోసమే ఆయన హత్య చేయబడ్డారు?"

"అంటే... మీ వుద్దేశ్యంలో...."

"అవును. మొదటి అనుమానితులు మీరే!"

"ఇన్స్పెక్టర్ గారూ! ప్లీజ్. ఆయన చనిపోతే నాకు సగం శాంతకి సగం ఆస్తి వొస్తుంది."

"అలా యెందుకు రాశారు?"

"నాకు తెలియదు సార్!"

"సగం ఆస్తి అంటే ఏ మాత్రం వొస్తుంది?"

"ఐదు లక్షలు!"

"ప్రాణాలు తీయడానికి పది పైసలు చాలు!"

"ఇన్స్పెక్టర్ గారూ! మీరు హద్దుమీరి మాట్లాడుతున్నారు."

"ఎలాగో చెబుతారా?"

"మా అన్నయ్యను ముష్టి ఐదులక్షలకోసం చంపుతానంటారా? మా ఆవిడ తరఫున నాకు బాగానే ఆస్తి కలసివచ్చింది."

"కావచ్చు. ఐదులక్షలు చేదుకాదు."

"ఇన్స్పెక్టర్ గారూ! నేను లీగల్ గా ప్రొసీడ్ కావలసి వుంటుంది!"

"ఉదయంనుండీ మీరు బెడ్ మీదే వున్నారా?"

"అవును!"

"మీ అన్నయ్యను రిసీవ్ చేసుకోవడానికి మీరు ఎందుకు వెళ్ళలేదు?"

"ఆ విషయం శాంత నే అడగండి!"

ఇన్స్పెక్టర్ శాంతవైపు తిరిగాడు.

"రాత్రి చిన్నాన్న ఆలస్యంగా వచ్చారు. నేనే ఆయన అలసట చూచి నాన్నగారిని రిసీవ్ చేసుకోవడానికి నేను వెళ్తానన్నాను."

ఇన్స్పెక్టర్ లేచాడు.

"శ్రీపతిగారూ! మాకు తెలియకుండా మీరు తిమ్మాపురం విడిచిపెట్టడానికిలేదు. ఈ కేసులో మొదటి అనుమానితులు మీరే!"

శ్రీపతి వెటకారంగా చూశాడు.

"నాకు ఎంతబలమైన మోటివ్ వుందో శాంతకీ అంత బలమైన మోటివ్ వుంది!"

శాంత చిన్నాన్నను విడ్డూరంగా చూచింది.

"ఎలా?" అడిగాడు ఇన్స్పెక్టర్.

"ఆమెకీ ఐదు లక్షలు చేరుతాదు!"

"చిన్నాన్నా!" శాంత గొంతు జీరబోయింది.

"శాంతా!" శ్రీపతి ఆమె తల నిమిరాడు. అతడి గొంతు వణుకుతోంది. కళ్ళలో నీళ్ళు కమ్మాయి.

"మీ శ్రీమతిగారు లేరా?"

"పురిటికి పుట్టింటికి వెళ్ళింది."

"లేట్ ప్రెగ్నెన్సీ...."

"ఎస్...."

ఇన్స్పెక్టర్ వద్ద సెలవు పుచ్చుకున్నాడు.

"చిన్నాన్నా! నాన్నను నేను చంపుతానా?" శాంత గొల్లుమంది.

శ్రీపతి ఆమె తల నిమిరాడు.

"వాట్టిదే తల్లీ! మాటమీద మాటవచ్చి అన్నాను! అన్నయ్య దేవుడు. అటువంటివాడిని ఎవడు పొట్టన పెట్టుకున్నాడో...."

"మార్చురీలో వుంది నాన్న శవం!"

"అవును మర్చిపోయాను. పద!" శ్రీపతి హడావుడిగా లేచాడు.

4

సిటీ బస్సు దిగాను. రోడ్డు దాటాను. సూపర్ బజార్‌లో ప్రవేశించాను. భవనం రద్దీగా వుంది.

శ్రీపతి పంపించిన చెక్కు నా అక్కౌంటులో పడింది. పదివేల రొక్కం నాకు అంతులేని శక్తి నిస్తోంది.

మరో ఆఫర్ వస్తుంది. నాకు నమ్మకవుంది. లక్ష్మీపతి హత్యకేసు ఫైలు మూతపడిపోయింది. శ్రీపతిని పోలీసులు వెంటాడి క్లీన్ సర్టిఫికేటు యిచ్చుకున్నారు. లక్ష్మీపతిని .38 కాలిబర్ పిస్తోలుతో కాల్చి చంపినట్టు పోస్టు మార్టంలో తెలిసింది. 38 కాలిబర్ పిస్తోళ్ళు వున్నవారిని వెంటాడారు పోలీసులు.

ప్రయోజనం శూన్యం!

ఉలిక్కిపడ్డాను. నన్ను యెవరో ఢీకొట్టారు. మెత్తటి శరీరం. ఆలోచనలకు ఫుల్‌స్టాప్ పెట్టి తలెత్తి చూశాను.

అందమైన కళ్ళు నన్ను పలకరించాయి. ఆమె ఎర్రటి పెదిమలు తడిగా మెరుస్తున్నాయి. కత్తిరించిన జుత్తు ఆమె భుజాలమీద పడుతోంది. అందమైన చీరకట్టూ మాచింగ్ బ్లవుజూ ఎత్తు మడమల జోడూ, మెడలో వొంటిపేట ముత్యాల హారమూ.... నా యెదుట అపరంజి బొమ్మ నిలబడింది.

"సారీ...." అందామె కోకిల కంఠం.

"మీరు తప్పుచేసినా నేను తప్పుచేసినా నేనే అంటే మగవాడిని క్షమాపణ కోరడం లోక ధర్మం!" నాకు నాలుక తడబడుతోంది. లేకపోతే చాంతాడు సంభాషణ ఎందుకు?

ఆమె నవ్వింది. పండు వెన్నెల విరిసినట్టయింది.

"ఒక్కరే వచ్చారా?" అడిగాను.

"ఈ ప్రపంచంమీద నేనూ ఒక త్తినే!"

"అదేం....మీ వాళ్ళు...."

"ఎవరూ లేరు. కొద్దిపాటి డబ్బు బాంకులో వుంది."

"నివాసం?"

"వర్కింగ్ వుమన్స్ హాస్టల్లో మా ఫ్రెండ్‌తో బాటు వున్నాను."

".... ...."

"మీరు?"

"ఒంటరిగాడినే. కొద్దిపాటి తెలివితేటలతో నడుపుకో గలిగే బిజినెస్సు వుంది!"

"ఏం బిజినెస్?"

"మీ వయసు అడిగానా?"

"లేదు, అయినా చెప్పమంటే చెబుతాను!"

"వద్దు, మీ వయసూ, నా బిజినెస్సూ రహస్యంగా వుంచుకుందాం!"

"మనం కలసి వుండేటట్టు మాట్లాడుతున్నారే?"

"మీకు అంగీకారమయితే కలిసి వుండవచ్చును."

ఆమె మొహంలో గులాబీపూలు పూశాయి.

ఇద్దరమూ బయటికి నడిచాం.

నాకు తలలో ఆలోచనలు రేకెత్తాయి.

ఈమెకు నిజంగానే వెనక ముందూ ఎవరూ లేరా! లేకపోతే నా గుర్తులు తెలిసి శ్రీపతి పంపించాడా? పంపివుంటే వాడిని మట్టుపెట్టడం ఎంత సేపు?

చిత్రం! జీవితంలో ఆడది యింత త్వరగా పరిచయం కావడం సహజమా? ప్రశాంతి తన జీవితంలో సులువుగా

ఇమడగలుగుతుందా?

ప్రశాంతివైపు చూశాను.

ఆ కళ్ళను ఎక్కడో ఎప్పుడో చూశాను.

ఎక్కడో ఎప్పుడో ఏముంది?

ఈ విశాల నగర జీవితంలో సాధ్యపడటం సహజం-ఆమెను ఎక్కడయినా నేను చూచివుండవచ్చును.

ఇద్దరమూ మా యింటికి వెళ్ళాం.

నా యింటిని చూచి ప్రశాంతి మురిసిపోయింది.

"అచ్చం ఇలాంటి యింట్లోనే నేనూ—నాకో తోడూ వుంటే బాగుండును అని కలలు కనేదాన్ని!" అంది ప్రశాంతి.

నేను ఆమెను అంటిపెట్టుకుని నిలబడ్డాను.

ఆమెవద్ద సువాసన వస్తోంది.

వణుకుతో ఆమె చేతిని పట్టుకున్నాను.

ఆమె నా గుండెలమీద తలవాల్చింది.

"మనకి రిజిష్టరు పెళ్ళయ్యేవరకూ నేను మైలపడను!" అంది ప్రశాంతి.

"ఈ రోజే అప్లికేషన్ పడేస్తాను! ఒక నెలలో మనం భార్యాభర్తలవుతాం!"

ఆమె తృప్తిగా చూసింది.

నేను వంటింట్లోకి నడిచాను.

"ప్రశాంతీ! ఇంతకాలంగా నా జీవితం తాడూ బొంగరమూ లేకుండా గడిచింది. మన సంసారానికి ఏం కావాలో చెప్పు!"

ప్రశాంతి వంటింటిని పరిశీలిస్తోంది.

"నేను ఆమెను వంటింట్లో విడిచిపెట్టి నా గదిలోకి

వచ్చాను. నెంబర్ డయల్ చేశాను. టెలిఫోన్‌లో అవతలకు రింగ్ వెళ్తోంది. ఒక అర నిముషం తర్వాత అవతల రిసీవర్ ఎత్తారు.

"మాధవ్! నువ్వేనా?" అడిగాను రిసీవర్‌లో.

"అవును."

"నేను రమాకాంత్‌ని మాట్లాడుతున్నాను."

"నువ్వా? ఏమిటి విశేషాలు?"

నేను కిటికీలోంచి బయటికి చూశాను. ప్రశాంతి వంటింట్లో బూజులు దులుపుతోంది.

"నీతో పనిపడింది!"

"చెప్పు!"

"నాకు ప్రశాంతి అనే అమ్మాయి పరిచయమయింది. ఆమెను నువు ఒకవారం రోజులపాటు వెంటాడాలి. వీలుంటే ఆమె గతాన్ని కలకాలి!"

"ఆమె అడ్రసు చెప్పు!"

"మా యింట్లోనే వుంటోంది."

"ఎప్పటినుండీ!"

"ఈ గంటనుండి."

"రోజుకి ఎంత యిస్తావ్?"

"ఎంత కావాలి?"

"యాభై రూపాయలు! ఖర్చులుగాక!"

"అలాగే. నువ్విచ్చే సమాచారం నాకు సంతోషం కలిగిస్తే మూడువందల రూపాయలు టిప్ యిస్తాను!"

"థాంక్యూ! ఒక గంట తర్వాత డ్యూటీలో వుంటాను."

"జాగ్రత్త!" రిసీవర్ పెట్టేశాను.

5

టిప్ టాప్ గా తయారయింది ప్రశాంతి. ఇంటికి తాళం పెట్టింది. రోడ్డుమీదకు అడుగుపెట్టింది., చకచక నడక సాగింది. ఆసీలు మెట్టడౌన్ దిగింది. సిటీ బస్సు స్టాపులో నిలబడింది. చూచీచూడనట్టుగా అప్ మీదకు చూసింది.

పెల్టుహాట్ పెట్టుకున్న యువకుడొకడు అప్ దిగుతున్నాడు.

ప్రశాంతికి ఆశ్చర్యంగా వుంది.

అదే పెల్టుహాట్ను తాను ఉదయమే లేచి మూడుసార్లు చూసింది. తాను బయట వరండా వూడ్చుతుంటే అతడు ఎలక్ట్రిక్ స్తంభం క్రింద తలవొంచుకు నిలబడ్డాడు. అదే మొదటిసారి తాను ఆ ఫెల్టుహాట్ను చూడటం! ఆ తర్వాత తాను వంటచేస్తూంటే వంటింటి కిటికీలోంచి కనిపించాడు. రోడ్డుమీద నిలబడి అటు తిరిగివున్నాడు. మూడోసారి న్యూస్ పేపర్ చదువుతూ రోడ్డుమీద కూర్చుండి కనిపించాడు.

మూడుసార్లూ అతడి ముఖం ఫెల్టుహాట్ చాటున కనిపించలేదు. ఇప్పుడూ అంతే!

తెల్లపాంటులో నీలం స్లాక్ టక్ చేశాడు. కాళ్ళకు ఒకమాదిరి విలువైన షూ. ఫెల్టుహాట్ మాటున అతడి కనుముక్కుతీరు మరుగున వుండిపోతోంది.

అతడు సిటీబస్సు స్టాప్కి అంతదూరంలో నిలబడ్డాడు. చేతిలోని న్యూస్ పేపర్ తిప్పాడు.

ప్రశాంతి నుదురు చిట్లించింది. అతడు పేపర్ చదవడంలేదు. మొహం కొద్దిగా ఎత్తి చూస్తున్నాడు. ఒక కన్ను తనవైపు చూస్తోంది.

ప్రశాంతికి కంపరంగా వుంది.

అతడు తననే చూస్తోన్నాడు. ఎందుకు? అయితే ఉదయంనుండీ అతడు తన కోసమే యింటిచుట్టూ తిరుగుతున్నాడన్నమాట!

ప్రశాంతికి మెదడులో మెరుపు వెలిగింది.

రమాకాంత్ అతడిని తనమీద నియోగించాడేమో! రమాకాంత్ తనని పూర్తిగా నమ్మాడు. తనకు అలా తోచిందేమో!

సిటీబస్సు వస్తోంది.

ఫెల్టుహాట్ కీ తనకీ మధ్యలో అడ్డంగా సిటీ బస్సు ఆగింది.

జనంలోంచి ప్రశాంతి అతడిని చూస్తోంది.

అతడు సిటీ బస్సువైపు పరుగెత్తుకుంటూ వస్తున్నాడు.

ప్రశాంతి చప్పున బస్సు ముందుకు పరుగెత్తింది. ఆడవాళ్ళ గేటులో ఎక్కలేదు. బస్సుకి కొంతదూరంలో టాక్సీ వుంది. టాక్సీ ఎక్కి కూర్చుంది.

"హెడ్ పోస్టాఫీసు...." అంది.

టాక్సీ కదిలింది.

ప్రశాంతి ఓరగా చూసింది. బస్సు వెనుక గుమ్మంలో ఫెల్టుహాట్ వ్యక్తి నిలబడి కనిపించాడు.

బస్సు డైరీఫారంవైపు వెళ్తోంది.

ప్రశాంతి నిట్టూర్చింది.

అతడు డైరీఫారం దిగుతాడు. వృధాప్రయాణం! తిరిగి వస్తాడు.

టాక్సీ జెయిలు రోడ్డులో పరుగుతీస్తోంది.

ప్రశాంతి హాండ్ బాగ్ తెరిచింది. పేపర్ కటింగ్ తీసింది.

"హత్యలు జరగాలా సంప్రదించండి!

పోస్టుబాక్సు నెం. 316

తిమ్మాపురం." అని వుంది.

రమాకాంత్ యింట్లో ఈ ముక్కలు తనకు చాలా దొరికాయి. ఇంతవరకూ రమాకాంత్ బిజినెస్సు గురించి తనకు తెలియలేదు. తనకీరోజు ఉదయం చెత్తబుట్టలో ఒక తెల్లటి కవర్ కనిపించింది. ముప్పయిఅయిదు పైసల స్టాంపు అంటించిన కవర్ అది!

కవర్ మీది చిరునామా 'పోస్టుబాక్సు నెంబర్ 316,

తిమ్మాపురం' అని వుంది.

అంటే కటింగులకూ వుత్తరానికీ రమాకాంతకీ సంబంధం వుండాలి. పైగా కవర్ మీది చిరునామా రాసిన రాత తనకి పరిచయమైన రాతే!

ప్రశాంతికి ఒళ్ళు గగుర్పొడిచింది. రమాకాంత్ వృత్తిరీత్యా హంతకుడు! డబ్బుకి ఆశపడి ఎంతపనయినా చేస్తాడు! తాను అతడితో కలసి సహవాసం చేస్తోంది. తల్చుకుంటే తనని చంపగలడు.

ప్రశాంతి పళ్ళు బిగించింది.

తనకి ఈ ప్రపంచంలో వున్న ఒక్క ఆధారమూ పోయింది.

ఇప్పుడు తాను భయపడటంలో అర్థం లేదు.

కటింగును హాండ్ బాగ్ లో వుంచింది.

టాక్సీ ఆగింది. ప్రశాంతి దిగింది. అద్దె చెల్లించి టాక్సీని పంపేసింది. చుట్టూ చూసింది. పోస్టాఫీసు భవనంలోకి నడిచింది. పోస్టాఫీసు రద్దీగా వుంది.

'పోస్టు బాక్సు' అని రాసివున్న విశాలమైన గదిలోకి వెళ్ళింది.

ఆ గదిలో సేఫ్టీ వాల్ట్సులున్నాయి. నెంబర్లు చూసు కుంటూ నడిచింది.

ప్రశాంతి గుండె దడదడలాడింది.

ఈ నెంబర్ ద్వారానే రమాకాంత్ పార్టీలను సంప్రదిస్తున్నాడు. హాండ్ బాగ్ లోంచి మైనం అచ్చు తీసింది. తాళంపట్టే రంధ్రంమీద అచ్చును నొక్కింది. అచ్చును భద్రంగా తిరిగి హాండ్ బాగ్ లో వుంచింది.

ఆ గదిలోంచి బయటకు నడిచింది.

మెయిన్ గేటులోకి చూచి వులిక్కిపడింది.

రమాకాంత్ లోపలికి వస్తున్నాడు.

ప్రశాంతి ప్రక్కకు తప్పుకుంది.

రమాకాంత్ 'పోస్టు బాక్స్' అని వున్న గదిలోకి నడిచాడు. ప్రశాంతి చాటునుండి చూస్తోంది.

రమాకాంత్ వాల్ట్సు తెరిచాడు.

అతడి మొహంలో ఉత్సాహం కనిపించింది.

ప్రశాంతి బయటకు పరుగెత్తింది.

కనిపించిన టాక్సీని పట్టుకుంది. ఇంటిముందు దిగింది.

దూరంగా చెట్టుక్రింద ఫెల్టుహాట్ వ్యక్తి నిలబడాడు.

6

పోస్టాఫీసులోకి నడిచాను.

పోస్టు బాక్స్ నెం. 316 ముందు ఆగాను. వాల్ట్సు తెరిచాను. పొడవుపాటి కవర్ వుంది. నేను సంతోషంగా ఎగిరి గంతేశాను. మరో బేరం వచ్చింది. ఈ కవర్ లో ఏ ప్రాణంవుందో—నా చేతుల్లో ఏ ప్రాణం ఎగరనున్నదో-

కవరు తీసుకుని తాళంపెట్టి వాల్ట్సును ఆప్యాయంగా తడిమాను. బయటికి నడిచాను. టాక్సీ ఎక్కి కూర్చు న్నాను.

టాక్సీ కదిలింది.

కవర్ తెరిచాను. తెల్లకాగితంమీద అల్లిబిల్లి రాత వుంది.

"మా ముసలి అత్తయ్యను మెట్లమీదనుండి తోసి చంపాలి. ఏమాత్రం కావాలి? బీచ్‌లో చిల్డ్రన్ పార్కులో ఏనుగుల బొమ్మవద్ద వుత్తరం వుంచాలి.

—రంగారావు."

ఉత్తరం మడిచి కవర్‌లో పెట్టాను. కవరు జేబులో పెట్టుకున్నాను. టాక్సీ అవలాండ్స్‌కి మళ్ళబోతోంది.

"బీచ్‌కి పోనివ్వు" అన్నాను.

టాక్సీ బీచ్‌రోడ్లోకి మరలింది.

చిల్డ్రన్ పార్క్ దగ్గర టాక్సీ దిగాను. బాడుగ చెల్లించి పంపేశాను. చిల్డ్రన్ పార్కులోకి నడిచాను. ఏనుగుల బొమ్మలవద్ద కూర్చున్నాను.

జేబులోంచి కాగితం కలం తీశాను.

జవాబు రాయబోయాను.

నా వెనుక అలికిడయింది.

తల త్రిప్పబోయాను.

"వెనక్కి చూడక!" అంది బొంగురు గొంతు.

"రంగారావుగారూ!" అన్నాను.

"అవును ఎంత కావాలి?"

'మానవుడు అత్రుతపడుతున్నాడు!' నిట్టూర్చాను.

"ఎంత యివ్వగలరు?" అడిగాను.

"ఇరవై వేలు!"

"ఇరవై అయిదు వేలు! తగ్గేదిలేదు!" చీకట్లోకి రాయి విసిరాను.

"ఆల్‌రైట్!" వెనుకనుండి చెక్కుముందుకు మొహం

మీదకు పెట్టాడు రంగారావు.

మౌనంగా చెక్కు అందుకున్నాను. ఖాళీగా వుంది.

"పేరు రమాకాంత్ అని రాయండి!" అన్నాను.

నా తెగింపు నాకే ఆశ్చర్యం కలిగిస్తోంది,

రంగారావు చెక్కుమీద నా పేరు రాసి, సంతకంచేసి అందించాడు.

"ఎప్పుడు?" అడిగాను

"ఇంట్లో నేనూ, మా ఆవిడ, ముసలి అత్తగారూ వుంటాం."

"మీకు పిల్లలు లేరా?" అడిగాను.

"లేరు."

"ఆస్తి కలుస్తుందా?"

"కలవదు."

"నాకు 25 వేలు యిస్తోంటే మీకు 25 లక్షలు కలవాలి అదీ నా కోర్కె!"

"ఆ విషయాలు నీ కనవసరం!"

"ఆల్ రైట్!"

"ఈరోజు నేనూ మా ఆవిడా మాట్నీకి వెళ్తాం! మా అత్తగారు మేడమీద గదిలో వుంటుంది. కళ్ళు కనిపించవు."

"క్షమించండి రంగారావుగారూ! ఆమెను చంపడానికి నాకు అభ్యంతరం లేదు కాని కారణం చెప్పండి!"

"తన కూతురును నాతో సంసారం చేయనివ్వదు. నా భార్య ఎప్పుడూ తల్లినే అంటిపెట్టుకుని వుండాలి!"

"ఐసీ.... సంసార సుఖం లేదన్నమాట!"

"మా యింట్లో మేం యిద్దరమూ పరాయివాళ్ళంగా మెలగాలి. మా అత్తగారి కోరిక అది!"

"మీరు ఇరవై అయిదువేలు యివ్వకపోయినా అటు వంటి ప్రాణిని చంపుతాను. నాకు డబ్బు అవసరం!"

"తుపాకీ వద్దు!"

"యాక్సిడెంట్ లాగానా?"

"అవును!"

"మెట్ల మీదనుండి తోసెయ్యనా?"

పార్కు వెనక పొదలలో ఎవరో కదిలిన చప్పుడు!

రంగారావు వులిక్కిపడి నా ముందుకు వచ్చాడు!

అతడికి పాతికేళ్ళుంటాయి. చేతులకు వుంగరాలు. అచ్చగా దొరబాబులాగా వున్నాడు.

"మనమాటలు యెవరో విన్నట్టున్నారు" అన్నాడు రంగారావు.

నేను చటుక్కున పొదలవైపు వెళ్ళాను. నా కంటికి ఎవరూ కనిపించలేదు.

"ఈ రోజే....వస్తాను!" అన్నాడు రంగారావు.

నేను తలూపి అతడివెంట నడిచాను.

"శాండ్ పార్కు దాటాక మూడో మేడ. యూక లిప్టస్ చెట్టు ఒకటే ఆవరణలో వుంటుంది." చెప్పి రంగారావు అక్కడే ఆగివున్న కారు ఎక్కాడు.

నేను నడిచి సిటీ బస్సు స్టాపులో ఆగాను.

7

"ఏమండీ! కాలింగ్ బెల్ మ్రోగుతోంది!"

బద్ధకంగా లేచాను. ప్రశాంతి నన్ను నిద్రలేపుతోంది. చటుక్కున మంచం దిగాను. బయటికి నడిచాను. తలుపు తెరిచాను. షర్టు సర్దుకున్నాను.

అవతల నలభై ఏళ్ళ వ్యక్తి నిలబడివున్నాడు. అతడి చెంపలు నెరిసి వున్నాయి. అయినా అతడి చేతులు

బలిష్టంగా మొహం కళగా యింకా యౌవనం కళతోనే వున్నాయి. అతడి కళ్ళు మెరుస్తున్నాయి.

"నన్ను రామానంద్ అంటారు" అన్నాడు అతడు చేయి చాపి.

నేను కరచాలనం చేయక తప్పలేదు.

"మిమ్మల్ని యిదే చూడటం!" అన్నాను.

"కావచ్చు. మీరు నాకు కొంతకాలంగా తెలుసు!"

"ఎలా తెలుసు?"

"డ్రాయింగ్ రూంలో కూర్చుందాం. నాకు చాల విషయాలు తెలుసు?"

"ఏ విషయాలు?"

"నిన్న మధ్యాహ్నం మూడు గంటల పన్నెండు నిమిషాలకు శాండ్ పార్క్ దగ్గర యింట్లో ఒక హత్య తెలుసు. మచ్చుకి ఇదో ఉదాహరణం అన్నమాట!"

నాకు నెత్తిన పిడుగులు పడ్డాయి—

అతడిని లోపలకు లాగాను. తలుపులు మూశాను.

"హత్యా? ఎవరు చేశారు?"

"మీరే. మేడమీదకు వెళ్ళారు. ఆమెను మెట్లమీద నుండి తోశారు."

"అబద్ధం!" నా భ్రమగానీ వృధాప్రయాస!

వీడెవడో ఘటికుడు. నిన్న మధ్యాహ్నం నేను ముసలిదాన్ని చంపేటప్పుడు వీడు ప్రక్కనే వున్నట్టు మాట్లాడుతున్నాడు.

"మీరు అప్పుడు ఎక్కడున్నారు?"

"నిన్న నేను మాట్నీ సినిమాలో వున్నాను."

"ఏ సినిమా?"

"మీరు చంపిన ముసలావిడ కూతురూ అల్లుడూ

చూస్తోన్న సినిమాయే."

"మీకు పిచ్చెత్తిందా?"

"ఏం?"

"మీరు సినిమా హాలులో వున్నారు. ఆ సమయంలో హత్య జరిగిందంటున్నారు. మీరు చూడని విషయం...."

రామానంద్ పకపక నవ్వాడు. సోఫాలో కూర్చుండి కళ్ళు మూసుకున్నాడు. మెల్లగా కళ్ళు తెరచి నావైపు ధీమాగా చూశాడు.

పిస్తోలు తెచ్చి వీడిని కాల్చితే!

నాకు అతడి ధీమా చూస్తే ఒళ్ళు మండిపోతోంది.

"నా దగ్గర టూయిన్ ఒన్ వుంది!"

"వుంటే? ఒక టేప్ రికార్డరూ, ఒక రేడియో కలసివున్న సెట్టు మీ వద్ద వున్నంత మాత్రాన ఏమవుతుంది?" నేను ఎదుటి సోఫాలో కూర్చున్నాను. నన్ను పసివాడిని చూసినట్టు చూశాడు రామానంద్.

"ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ లో నాకు ఫారిన్ డిగ్రీ వుంది తెలుసా? నా దగ్గరవున్న టూయిన్ ఒన్ వేరే ఏర్పాటున్న యంత్రం!"

"ఏమిటా ఏర్పాటు?" అరిచినట్టన్నాను. నా మీద నాకే అదుపు తప్పుతోంది.

రామానంద నవ్వి, "ఆరవక! నా దగ్గర టెలివిజన్ కమ్ కెమేరా వున్నది. టెలివిజన్ లో ప్రసారమవుతోన్న ప్రసారాలను అవసరమని కెమేరా భావిస్తే అది వెంటనే 35 ఎం. ఎం. ఫిల్మును షూట్ చేస్తుంది."

"కావచ్చును. విజ్ఞాన శాస్త్రం అభివృద్ధి మీద నాకు ఆశవుంది!"

"అంతవరకూ నయం!" రామానంద ముందుకు

ఒంగాడు. నా షర్టుమీద వ్రేలుపెట్టి చూపించాడు.

"నిన్న నువు హత్యచేసేటప్పుడు ఇదే షర్టు వేసుకున్నావు! షర్టు చివర చూడు."

ఆశ్చర్యపోయాను. షర్టు చివర గుండ్రటి బొట్టువంటి మచ్చవుంది. రామానంద వ్రేలితో తన చేతులోకి లాక్కున్నాడు దానిని.

అది గుండ్రంటి రేకు ముక్క. దానిమీద చిన్న తీగలు అటొకటీ యిటొకటీ అంటుకుని వున్నాయి. ఈ రేకు ముక్క నా షర్టుమీద ఎలా అంటుకున్నది? నాకువుండే కొద్దీ మతిపోతోంది.

"లక్ష్మీపతిని నువు హత్యచేస్తో నా కంట్లో పడ్డావు. అతడి చావువలన నీకు డబ్బు ముట్టింది. కాని నువు చట్టానికి దొరకవ్. నీకు మోటివ్ లేదు. నువు వృత్తిరీత్యా హంతకుడివని కనిపెట్టాను. సమయం చూసుకుని నీ షర్ట్సు అన్నింటికి ఈ రేకుముక్క—అయ్‌మీన్ మైక్రో ట్రాన్స్‌మీటర్‌ను అంటించాను. మైక్రో ట్రాన్స్‌మీటర్‌ను టెలివిజన్ తెర ఆకర్షిస్తోంది. నువు ఎక్కడికి వెళ్తే అక్కడ మూడు నాలుగు గజాల వ్యాసంలో దృశ్యం టెలివిజన్ మీద ప్రసారమవుతుంది. నీలో తీవ్రమైన భావావేశాలు చెలరేగుతోంటే మాత్రం కెమెరా కలగ చేసుకుంటుంది."

"నిజమా?"

రామానంద తన పాంటు జేబులో చెయ్యిపెట్టి కవర్ తీశాడు. కవర్‌లోంచి 35 ఎం. ఎం. ఫోటోలు బయట పడ్డాయి.

ఫోటోలు అందుకుని తేరిపార చూశాను.

ఒక ఫోటోలో ముసలావిడ ప్రక్కగా నిలబడ్డాను. ఆమెను దొంగ చూపులు చూస్తోన్నాను.

రెండో ఫోటోలో నా చెయ్యి ఆమె భుజానవుంది. ఆమె కాళ్ళక్రింద మొదటి మెట్టు!

మూడో ఫోటోలో ముసలావిడ మెట్లమధ్య పడి వుంది. ఆమె తల చిట్లినట్లు తలమీద నల్లటి మచ్చ కనిపిస్తోంది. ఆ మచ్చ వెంబడి రక్తం కాబోలు మొహం మీద కారుతోంది.

నాకు వెన్నులోంచి చలికెరటం పుట్టుకొస్తోంది.

ఎంతో తెలివిగా హత్యలు చేస్తోన్నట్టు భ్రమపడ్డాను. పురిట్లోనే సంధికొట్టింది.

"ఇవన్నీ నాకు ఎందుకు చూపిస్తున్నారు?"

"ఈ ఫోటోలు చూశాకనయినా నీకు తోచివుండాలి. బ్లాక్ మెయిలింగ్ కాబోలు అంటారు ఈ పద్ధతికి."

"ఎంతకావాలి? నెగటివ్స్ యిచ్చెయ్యాలి!"

"ఇరవై వేలు! నెగటివ్స్ యివ్వను."

"ఏం?"

"నీకు నెగటివ్స్ యిచ్చి ప్రయోజనమేమిటి?"

"మీ వుద్దేశ్యం నాకు స్పష్టంగా అర్థంకావడంలేదు."

"నువు మరల హత్యచేస్తావు. నా కెమెరా నేను ఎక్కడున్నా నా అవసరం లేకుండా ఎటూ నిన్ను పట్టుకుంటుంది. ఎన్ని నెగటివ్స్ కొనగలవు?"

"అంటే నేనో హత్య చేసినప్పుడల్లా ఇరవైలు వేలు యివ్వాలా?"

"చూశావా? కంగారుపడి నన్ను ఏకవచనంలో మాట్లాడుతున్నావు. ఆ తర్వాత జరిగే హత్యలలో నా రేటు తరువాత ప్రకటిస్తాను."

నాకు కళ్ళనీళ్ళ పర్యంత మవుతోంది.

"నాకు ఈ హత్యలో ముట్టింది 35 వేలు!"

"నీ రేట్లు నీవే నా రేట్లు నావే!"

"నిన్ను చంపితే!"

"చంపు. కెమెరా నిన్ను సులువుగా పట్టిస్తుంది" రామానంద తన షర్టు కాలర్ ఎత్తాడు. కాలర్ క్రింద మూడు రేకు ముక్కలున్నాయి "అంటే మూడు మైక్రో ట్రాన్స్‌మిటర్సన్నమాట!" అన్నాడు లేస్తూ.

"నీ కెమెరా, నీ టెలివిజన్ నిజమేనా?"

"నమ్మూ, నమ్మకపో!" రా మా న ం ద్ బయటికి నడిచాడు.

"సాయంకాలం—ఇరవై వేలు!" మెట్లు దిగి రోడ్డు మీద అడుగు పెట్టాడు.

నేను వరండాలో నిలబడి చూశాను.

మాధవ్ వస్తున్నాడు. రామానందను అతడికి చూపించి సైగ చేశాను.

మాధవ్ వ్రేలు చూపించి అడుగుతున్నాడు.

'రోజుకి వందా?' అని కాబోలు.

నాకు చిర్రెత్తిపోయింది.

డబ్బు కోసం మొహం చూసుకుంటానా?—

మాధవ్ తలూపి రామానంద వెనకపడ్డాడు.

8

"హత్య జరగాలి—614879కి ఫోన్ చేయండి" ఇంతే వుంది కాగితంలో. జేబులో వుంచుకుని పోస్టాఫీసు బయటకు నడిచాను.

రోడ్డువారగా పబ్లిక్ టెలిఫోన్ బూత్ కనిపించింది.

బూత్‌లో దూరి రిసీవరెత్తాను. 614879కి రింగ్ చేశాను.

అవతల గొంతు వినిపించగానే సాకెట్‌లో నాణెం

వేశాను.

"ఎవరు కావాలి?" అడిగారు అవతల.

"పి. బి. 316" అన్నాను.

"రైట్. ఎంత కావాలి?"

"యాభై వేలు."

"చాల ఎక్కువ!"

"ఈ మధ్యాహ్నంలోపుగా క్యాష్ కావాలి!"

"అలాగే యిస్తాను!"

"ఎవరిని హత్య చేయాలి?"

'ప్రణవ్ గార్డెన్స్'లో రేపు రాత్రి ప్లిమత్ కారులో 10 గంటలకు ఒక వ్యక్తి వస్తాడు. అతడు కారును గారేజిలో వుంచి బయటకు రాగానే తుపాకీతో చంపాలి. మిస్సవకూడదు."

"అతడి పేరు?"

"జగ్గయ్య. కోటీశ్వరుడు జగ్గయ్య!"

నవ్వుకున్నాను. కోటీశ్వరుడని మెడలో బోర్డు వుంటుందా?

"రేపు రాత్రి 10 గంటల రెండు నిమిషాలకు గారేజి ముందు శవం వుంటుంది. సరేనా?"

"క్యాష్ ఎలా అందించాలి?"

"నేను ప్రణవ్ గార్డెన్స్ యివతల తపాలా పెట్టెవద్ద నిలబడతాను. క్యాష్ తెచ్చి చేతికి యివ్వండి!"

"అలాగే...."

"మీ పేరు?"

"అవసరం లేదు. పావు గంటలో తపాలా పెట్టెవద్ద క్యాష్ అందించబడుతుంది."

నేను రిసీవర్ని క్రెడిల్ చేసి చకచక జేబులోంచి

సామగ్రి తీశాను. దువ్వెనతో మధ్యపాపిడి తీశాను. చెంపలకు పౌడర్ అద్దాను. సన్నటి రిమ్ వున్న కళ్ళద్దాలు పెట్టుకున్నాను. చొక్కా తిరగవేసి తొడుక్కున్నాను.

బూత్ లోంచి బయటకు నడిచాను.

ప్రణవ్ గార్డెన్స్ వైపు నడవసాగాను.

రోడ్డు నిర్మానుష్యంగా వుంది. ఈ రోడ్డు ఎప్పుడూ యింతే! తపాలా పెట్టెకద్ద ఆగాను. ఐదు నిముషాల తర్వాత బురఖాలో వున్న ఒక స్త్రీ వచ్చి ఒక సంచిని చేతికి అందించి వడివడిగా వెళ్ళిపోయింది.

అటూ యిటూ చూచి సంచిని తెరిచి చూశాను.

సంచిలో కరెన్సీ నోట్లున్నాయి. నా సంతోషానికి అంతులేదు.

ఉత్సాహంతో సంచీ తీసుకుని చకచక నడవసాగాను.

రోడ్డుమీద ఖాళీగా వెళ్తోన్న ఆటో కనిపించింది.

ఇల్లు చేరుకున్నాను.

ప్రశాంతి నా కోసమే ఎదురు చూస్తోంది.

ఆమెను పలకరించి సంచితో నా గదిలోకి వెళ్ళాను. తలుపు చేరవేసి డబ్బు లెక్కపెట్టాను. యాభై వేలు!

మాధవ్ కు టెలిఫోన్ చేశాను.

ప్రశాంతి వంటింట్లో వున్నట్టు అలికిడవుతోంది.

మాధవ్ పలికాడు.

"అతడు సబర్బన్ ట్రెయిన్ ఎక్కి తప్పించుకు పోయాడు!" అన్నాడు మాధవ్.

నేను నిట్టూర్చి, "ఈ సాయంకాలం అతడు నా యింటికి వస్తాడు. అతడిని జాగ్రత్తగా వెంటాడు. అతడి

ఇంటి అడ్రసు కనుక్కో. అడ్రసుకి వందరూపాయలు విడిగా యిస్తాను" అన్నాను.

"అలాగే...."

నేను డబ్బులో ఇరవై వేలు వేరుపరచాను. మిగతా సొమ్మును గాడ్రేజ్ బీరువాలో వుంచాను. ఇరవై వేలు విడిగా కట్టకట్టి క్రింది అరలో వుంచాను. బీరువాకి తాళం పెట్టాను.

వంటయింట్లోకి నడిచాను.

"అన్నం వడ్డించనా?" అడిగింది ప్రశాంతి.

తలూపి డైనింగ్ టేబులువద్ద కూర్చున్నాను.

ప్రశాంతి అన్నం వడ్డించసాగింది.

"నిన్న అతడు టూయిన్ ఒన్ అమ్ముతానంటాడా? నేను సరిగా వినలేదు!" అడిగింది ప్రశాంతి.

నాకు తలలో మెరుపు మెరిసింది.

ప్రశాంతికి తట్టినట్టు — టూయిన్ ఒన్ కొంటే మంచిదేమో!

"అమ్ముతాననలేదు! దానిగురించి చెప్పుకువచ్చాడు!" అన్నాడు.

"అతడిదంతా బోగస్ వ్యవహారంలాగా వుంది!"

స్పష్టంగా ఫోటోలు చూపిస్తోంటే బోగస్ వ్యవహారం ఎలా అవుతుంది?

అందుకే నేను అనాసక్తంగా తలూపాను.

9

మాధవ్ ఆ యింటిముందు ఆగాడు.

రామానంద యింటిమెట్లు ఎక్కి వరండాలో అడుగు పెడుతూ కనిపించాడు. రమాకాంత్ అతడిని ఆహ్వానంగా రిసీవ్ చేసుకున్నాడు.

రామానంద మీద అతడికి గూఢచారి చర్య చేయ వలసిన అగత్యం ఏమిటి?

మాధవ్ ఆలోచిస్తున్నాడు.

ఇద్దరూ లోపలి గదిలోకి వెళ్ళారు.

మాధవ్ మెల్లగా యింటి ప్రక్కకు చేరుకున్నాడు. గది కిటికీవద్దకు ప్రాకాడు.

"ఆల్ రైట్! ఇరవై వేలు! సరిపోయాయి!" అంటు న్నాడు రామానంద.

రమాకాంత్ మెల్లగా నవ్వి, "మాట తప్పను!" అన్నాడు.

"ఆల్ రైట్! వస్తాను!"

"రామానంద్! నీ యంత్రం అమ్ముతావా? యాభై వేలిస్తాను. నీకు కావలిస్తే మరోటి తయారుచేసుకో వచ్చు!"

"అమ్మడమా? మై గాడ్! చూపించను కూడా చూపించను!"

"ప్లీజ్! రామానంద్! ఆ యంత్రం ఒక్కసారి చూపించు? అది ఎలా వుంటుందో చూడాలి! లేకపోతే నువు అబద్ధమాడుతున్నట్లే!"

"నువ్వు వెర్రివెధవలాగా మాట్లాడక! నా నిజాయితీని చూపించుకోవలసిన అవసరం నాకు లేదు."

రమాకాంత్ నిర్ఘాంతపోయాడు.

రామానంద బయటికి నడిచాడు.

మాధవ్ చప్పున రోడ్డుమీదకు దిగాడు.

రామానంద దారిని పోతున్న టాక్సీ ఆపాడు. ఎక్కి కూర్చున్నాడు.

మాధవ్ పొదల వెనుక ఆపిన స్కూటర్ వైపు

నడిచాడు.

క్షణాలలో స్కూటర్ రామానంద ఎక్కిన టాక్సీ వెంటపడింది. టాక్సీ నేషనల్ హైవేకి మరలింది.

నిర్మానుష్యంగా వున్న చోట ఆగింది.

మాధవ్ కొద్ది దూరంలో స్కూటర్ ఆపాడు.

రామానంద టాక్సీ దిగాడు.

మాధవ్ వైపు నడిచివచ్చాడు. మాధవ్ అతడివైపు తెల్లబోయి చూశాడు. రామానంద్ మెరుపులాగా అతడి మీద దూకాడు. గడ్డంక్రింద బలంగా గుద్దాడు.

మాధవ్ స్కూటర్‌తోసహా ప్రక్కకి పడ్డాడు.

కెవ్వున అరిచాడు. అతడి కుడికాలు మీద స్కూటర్ పడింది.

రామానంద ఏమీ జరగనట్టుగా టాక్సీవైపు కదిలాడు.

10

వాచీ చూసుకున్నాను. రాత్రి 9-30 అయింది. రోడ్డుమీద నడుస్తున్నాను. మరో పావుగంటలో ప్రణవ్ గార్డెన్స్‌లో వున్నాను. ఆకాశంలో చవితి చంద్రుడు మసక వెన్నెలలో ప్రసరిస్తున్నాడు.

ప్రణవ్ గార్డెన్స్ చుట్టూ ప్రహరీగోడవుంది. గోడ మీద చేతులుంచి లోపలకు దూకాను. లోపల క్రోటన్ మొక్కలు, సన్నజాజి పందిరి.... ఆ ప్రక్కగా కారు షెడ్డు.... సన్నజాజి పందిరి క్రింద నుండి గేటులోంచి వచ్చేరోడ్డు గారేజివైపు వెళ్తోంది. గేటులో గూర్ఖా వున్నాడు.

దట్టంగా వున్న క్రోటన్ మొక్కల చాటున కూర్చున్నాను. పిస్తోలు తీసి సిద్ధంగా వుంచుకున్నాను. ఆరు బుల్లెట్లతో పిస్తోలు బరువుగా వుంది. మొక్కల చాటు

నుండి గేరేజి స్పష్టంగా కనిపిస్తోంది.

వాచీలో సమయం పదయింది.

గేటువద్ద కారువచ్చి ఆగింది. హెడ్‌లైట్స్ కాంతి లోపలకు ప్రసరిస్తోంది.

గూర్ఖా గేటు తెరిచాడు.

నా గుండెల చప్పుడు నాకే విచిత్రంగా వినిపిస్తోంది.

కారు లోపలకు వస్తోంది.

నేను తలవంచి కూర్చున్నాను.

కారు నా ముందునుండే వెళ్ళింది. గారేజివద్ద ఆగింది. అతడు కారు దిగాడు. గేరేజి తలుపు తెరిచాడు.

నేను తలవొంచి సేఫ్టీ కాచ్ లాగాను.

సైలెన్సర్ అమరిక నిర్దుష్టంగానే వుంది.

కారు లోపలకు వెళ్ళింది.

అతడు గేరేజి మూయలేదు. నా వైపు వస్తున్నాడు.

నేను ఆలోచించలేదు. చటుక్కున లేచి నిలబడ్డాను.

అతడు నా వైపు తెల్లబోయి చూశాడు.

అతడు కనురెప్ప వేయకుండానే పిస్తోలు తూటాలు తినగలిగాడు. నా గురికి నన్ను నేనే అభినందించు కున్నాను.

అతడు మాట్లాడకుండానే నేల కూలిపోయాడు.

నేను చకచకా గోడ దూకాను.

నిశ్చింతగా నడుస్తున్నాను.

ఎలక్ట్రికల్ స్తంభం వెలుగులో రిక్షా కనిపించింది.

రిక్షా మాట్లాడుకుని యిల్లు చేరాను.

ప్రశాంతి ప్రశాంతంగా నిద్రపోతోంది. నా గదిలోకి వెళ్ళాను.

టెలిఫోన్ గణగణలాడింది.

రసీవరె త్తి, "మాధవ్!" అన్నాను.

"కాను, రామానంద!" అటుప్రక్కనుండి వినిపించింది.

నాకు గుండెలు గుబగుబలాడాయి.

"చెప్పండి!" అన్నాను. ఎందుకయినా మంచిది. రామానందతో స్నేహంగా వుంటే నష్టంలేదు.

"నువు ఇప్పుడే హత్యచేశావు!"

అరె వీడు దేవాంతకుడు లాగా వున్నాడు. షర్ట్ తడుముకున్నాను. షర్టు వీపుమీద మైక్రోట్రాన్స్మిటర్ అంటుకుని వుంది.

నన్ను నేనే తిట్టుకున్నాను. నా నీడలాగా రామానంద నా వెంటే తిరుగుతున్నాడు. నేను కళ్ళు మూసుకుని ప్రవర్తించుతున్నాను.

"నేను హత్యచేయలేదు!" దబాయించాను.

రామానంద పకపక నవ్వాడు.

"నిజమే! నువు కావలసిన వ్యక్తిని హత్యచేయలేదు."

"ఏమిటి మీరు చెప్పేది?"

"నువు జగ్గయ్యను హత్యచేయలేదు!"

అతడి వాక్యం నాకు కొరుకుడు పడటంలేదు.

"నువు జగ్గయ్య అనుకుని జగ్గయ్య స్నేహితుడిని హత్య చేశావు!"

"నిజమా?"

"అవును. జగ్గయ్యతోపాటు అతడి స్నేహితుడు ప్రణవ్ గార్డెన్స్కి వచ్చాడు. జగ్గయ్య గేరేజిలో కారుకు తాళంపెడుతోంటే అతడి స్నేహితుడు తోటలోకి వచ్చాడు. నా టెలివిజన్ ఈ దృశ్యం అంతటినీ తెర మీద ప్రసారం చేయగలిగింది. స్నేహితుడిని కాల్చి

చంపావు. అతడు కిక్కురుమనకుండా నేలకూలాడు. నువు గోడ గెంతావు.

సరిగ్గా అదే సమయంలో గారేజిలోంచి జగ్గయ్య వచ్చాడు. తన స్నేహితుడికోసం చుట్టూ చూశాడు. అంతే! నువు రోడ్డుమీద నడుస్తోండటంతో టెలివిజన్ కి శక్తినీ చుట్టు మాత్రమే దృశ్యాన్ని ఆకర్షించుకోవడంలో పరిమితనుయిపోయింది."

"ఇంతా చూస్తే నేను పనికిమాలిన హత్య చేశానా?"

"అవును."

చచ్చాను! డబ్బు తిరిగి యివ్వమంటాడేమో అతడు.

"రామానందంగారూ! నాకు మీ యంత్రాన్ని చూడాలనివుంది ప్లీజ్ .... చూపించరూ!"

"ఆలోచించి రేపు చెపుతాను!" అవతల క్లిక్ మన్నది.

నిట్టూర్చి రిసీవర్ పెట్టేశాను.

నాకు ఆ యంత్రం సొంతమయితే....

అసలు నేను హత్యలు చేయనక్కరలేదు. నేరస్థులను పనిగట్టి వాళ్ళ దుస్తులకు మైక్రోట్రాన్స్మిటర్ కు అమర్చితే చాలు! మిగతా పని అదే చేసుకుపోతుంది.

టెలిఫోన్ మరల గణగణలాడింది.

అవతల మాధవ్ పలికాడు.

"రామానంద నా కాలు విరగగొట్టాడు. నువ్వు ఇచ్చే వందకోసం కక్కుర్తిపడ్డాను. నాకు కాలు పోయింది."

"ఎలా జరిగింది?" నాకు చాలా చిరాకుగా వుంది.

మాధవ్ చెబుతున్నాడు.

ఎవరో దయామయుడు అతడిని జనరల్ ఆస్పత్రిలో చేర్చాడట!

అతడికి సానుభూతి చెప్పి ఫోన్ పెట్టేశాను.

11

"కారు తెచ్చాను. నీ కళ్ళకు గంతలు కట్టి తీసుకు వెళ్తాను."

"దారి తెలిస్తే నీకు వచ్చిన ప్రమాదం ఏమిటి?"

"నువ్వు హంతక వృత్తిలో నిలదొక్కుకుంటున్నావు."

"అయితే...."

"వాదన అనవసరం! టూ ఇన్ వన్ చూడాలనుకుంటే రా!"

రామానంద నాకు ఏ మాత్రం అర్ధంగావటంలేదు. యంత్రం చూడాలి! దాని నిజాయితీ పరీక్షించాలి. అతడు అమ్మితే ఆ యంత్రం కొనుక్కోవాలి. అప్పుడే రామానంద ఆటకడుతుంది. అంతవరకూ నేను సహనం చూపించాలి.

"సరే. బయలుదేరదామా?" అన్నాను.

రామానంద లేచాడు.

ప్రశాంతి మేము కూర్చున్న చోటికి వచ్చింది. ఆమె చేతిలో ట్రే వుంది. ఇద్దరమూ కాఫీలు అందుకున్నాం.

"బయటికి వెళ్తున్నారా?" అడిగింది ప్రశాంతి.

తలూపాను.

"మీరు టైమంతా బయటే గడుపుతున్నారు. నాకు యింట్లో ఒంటరితనమూ భయమూనూ...." అంటోంది ప్రశాంతి.

"ఈమె మీ మిసెస్సా?" అడిగాడు రామానంద.

అతడి దృష్టిలో ప్రశాంతి పడటం నాకు ఎందుకో హితవుగాలేదు.

తలూపి, "రండి రామానందగారూ!" అని తొందరగా బయలుదేరతీశాను.

ప్రశాంతి గుడ్లనీరు క్రుక్కుతోంది.

భవిష్యత్తు నిర్మించుకోవడానికి ఆటంకంగా స్త్రీ మారకూడదు.

నేను నిర్లక్ష్యంగా బయటికి కదిలాను. రామానంద నా వెనుక వచ్చాడు.

రోడ్డుమీద కారు ఆగివుంది.

"ముందు సీట్లో కూర్చో!" అన్నాడు రామానంద.

అతడి మాట పాటించాను.

కారు బయలుదేరతీశాడు రామానంద.

నిర్జనంగా వున్న రోడ్డుమీద ఆపాడు. విండ్ స్క్రీన్ ఎత్తాడు. అవి కూలింగ్ స్క్రీన్స్! దట్టమైన నలుపు రంగులో వున్నాయి. డ్రయివింగ్ సీటుముందున్న గ్లాస్ మాత్రమే తెల్లగావుంది. తన జేబులోంచి నల్లటి గుడ్డపట్టీ తీశాడు. నా కళ్ళకి అడ్డంగా పట్టిపెట్టి కట్టేశాడు. కళ్ళు వుండీ గ్రుడ్డివాడినయ్యాను.

కారు బయలుదేరింది. టర్నింగులు తిరుగుతోంది. వాటినిబట్టి కారు ఎటు వెళుతోందో గుర్తించబోయాను. సాధ్యంకాలేదు. పావుగంట తర్వాత కారు ఆగింది. నన్ను చెయ్యి పట్టుకుని కారు దింపాడు రామానంద. నన్ను నడిపించుకుంటూ వెళ్ళాడు.

పెద్ద ఇనుప తలుపు తెరుచుకుంది.

నన్ను లోపలకు తీసుకువెళ్ళాడు రామానంద.

మా వెనుక తలుపు మూసుకుంది. కారు గేరేజిలాగా వుంది.

రామానంద నన్ను తడిమాడు. నా జేబులో వున్న ఆయుధం తీసుకున్నాడు.

నా అదృష్టదేవత—పిస్తోలు అది!

"ఇక్కడ నిన్ను చంపితే—" నవ్వాడు రామానంద. అతడి నవ్వు సంతోషంగా లేదు.

నవ్వాను "నన్ను చంపలేవు. చంపితే నీకే నష్టం!" అన్నాను.

అతడూ నవ్వి నా కళ్ళకున్న నల్లపట్టి తొలగించాడు.

12

నాకు చుట్టూ మసకగా కనబడటం మొదలుపెట్టింది.

నిజంగానే అది కారు గేరేజి. విశాలంగా వుంది. వెనుకప్రక్కకి గుమ్మం వుంది. రామానంద ఆ గుమ్మానికి వున్న తలుపు తెరిచాడు.

నన్ను ఆ గదిలోకి రమ్మన్నాడు.

నేను అతడి వెంట గదిలోపలకు నడిచాను.

ఆ గది చిన్నది. గోడ ప్రక్కగా పెద్దసైజు టెలివిజన్ సెట్టువుంది. సెట్టుకి ప్రక్క భాగంలోంచి 35 ఎం. ఎం. ఫిలిం తొంగి చూస్తోంది. రామానంద ఆ ఫిలిం పట్టుకుని లాగాడు.

"రాత్రి నువు చేసిన హత్య రికార్డయింది!" అన్నాడు రామానంద.

ఆ ఫిలింను వెనక ప్రక్కకి లాగాడు. ఏవేవో స్విచెస్ నొక్కాడు. టెలివిజన్ స్క్రీన్ మీద లైటు వెలిగింది. ఆ వెనకనే లైటు ఆరి అడ్డుగా రూళ్ళు పరుగెత్త సాగాయి. తోట, క్రోటన్ మొక్కలూ వాటిమధ్యగా అస్పష్టంగా కనిపిస్తోన్న కార్ గారేజ్.

దృశ్యం మారింది.

గారేజిముందు కారు ఆగింది. క్రోటన్ మొక్కల చాటున నేను ఒదిగి కూర్చున్నాను.

తర్వాతి దృశ్యంలో కారులోంచి దిగిన వ్యక్తి కని

పిస్తున్నాడు.

నేను అతడిని పిస్తోలుతో బెదిరిస్తూ తర్వాత కనిపించాను.

నాకు రక్తంలో నుంచి తేల్చుతోన్నట్టు కడుపులో దేవుతోంది.

రామానంద ఘటికుడు. అతడి యంత్రం అద్భుతం!

"ఆపండి! చూడలేను!" అరిచాను.

టెలివిజన్ మీద దృశ్యాలు ఆగాయి.

"కెమెరా చూపించండి!" అడిగాను.

"పిచ్చివాడా! కెమెరా లోపలే వుంటుంది. టెలివిజన్ ఆకర్షించే వ్యక్తిలోని భావావేశాన్ని బట్టి కెమెరా ఆటోమేటిక్ గా పని చేయడం మొదలుపెడుతుంది. షూట్ చేసిన ఫిల్ము నెగెటివ్ బయటికి వస్తుంది. ఆ ఫిలిం తిరిగి టెలివిజన్ లో లోడ్ చేస్తే పాజిటివ్ లో స్క్రీన్ మీద బొమ్మ కనిపిస్తుంది. అంతే!"

చాల విచిత్రమైన అమరిక! అతడి మేధస్సును నిజంగానే మెచ్చుకున్నాను.

రామానంద టెలివిజన్ క్రింది అరలోంచి ఒక అట్టపెట్టె తీశాడు. దానినిండా మైక్రో ట్రాన్స్మిటర్స్ వున్నాయి, తోకకప్పల్లాగా.

రామానంద ఇప్పుడే వస్తానని చెప్పి, గది బయటికి నడిచాడు.

"ఈ యంత్రాన్ని ఎలా తీసుకువెళ్ళాలి?" ఆలోచిస్తున్నాను.

అప్పటికే చిన్న గుమ్మం తలుపు మూసుకుంది.

తలుపు బయట గొళ్ళెం పెట్టాడు. అయినా నేనా విషయం అంతగా పట్టించుకోలేదు. నేను టూయిన్ ఒన్

వద్దకు నడిచాను ఉత్సాహంగా. రామానందను చంపైనా దాన్ని స్వాధీనం చేసుకోవాలనుకున్నాను.

టెలివిజన్ ఆగిపోయింది.

నేను స్విచ్ నొక్కాను. టెలివిజిన్ పని చేయలేదు. నాబ్స్ త్రిప్పాను.

ప్చ్! టెలివిజన్‌లో వులుకూ పలుకూలేదు. కాబిన్ తట్టాను. టెలివిజన్ వెనక భాగంలో రేకు తెరిచాను. లోపలకు చూచి తెల్లబోయాను. మాజిక్‌లాంతర్ వుంది. దానికి స్ప్రింగ్ చుట్టింది. ఇవతల ప్రక్క స్లయిడు లున్నాయి.

నాకు తలలో మెరుపు మెరిసింది.

స్లయిడ్స్ అందుకున్నాను. పాజిటివ్‌లోకి మార్చిన ఫిలింలు వాటిలో ఫ్రేము కట్టి వున్నాయి. స్లయిడ్స్ లాగడంలో స్ప్రింగ్ తెగింది.

గదిలో ఎక్కడో టక్‌టక్ చప్పుడవుతోంది. అలారం కదులుతోన్న చప్పుడు!

టెలివిజన్ అని రామానంద అమ్మింది డొక్కు కాబిన్!

నా కళ్ళు అటు చూశాయి. కాబిన్‌లో వుత్తరం వుంది. అందుకుని చూశాను.

ఆ వుత్తరం నాకు రాసిందే!

"డియర్ రమాకాంత్!

నువ్వు మోసపోయినట్టు ఈపాటికి తెలిసేవుంటుంది. నువ్వు లక్ష్మీపతిని చంపావు. లక్ష్మీపతి కూతురు శాంత నిన్ను చూసింది. శ్రీపతి తరఫున నువ్వు ఆమె తండ్రిని చంపావని అర్థం చేసుకుంది. ప్రశాంతిగా పేరు మార్చుకుంది. వేషం మార్చుకుంది. నిన్ను వంచించింది. ఆశ్రయం సంపాదించుకుంది.

నువ్వు ఒక పోస్టుబాక్స్ నెంబర్ను మెయిన్ టెయిన్ చేస్తోనట్టు తర్వాత తెలుసుకుంది.

ప్రశాంతీ నేనూ ప్రేమికులం. ఆమె నాతో చెప్పింది. వాల్వ్ తాళింపట్టే రంధ్రం, తాళం చెవినీ మైనం ముద్రలు తీసి నాకు యిచ్చింది. రంగారావు రాసిన వుత్తరాన్ని నీకంటే మేమే ముందు చూశాం. చిల్డ్రన్ పార్క్లో కాచుకున్నాం.

రంగారావుకీ నీకూ జరిగిన సంభాషణ విన్నాం. ఆ మధ్య రంగారావు యింట్లో ప్రవేశించాం. నువ్వు ముసలావిడను హత్య చేసేటప్పుడు ఫోటోలు తీశాం. 35 ఎం. ఎం. ఫిలింమీద వీలైనన్ని ఎక్కువ ఫోటోలు తీశాం.

ప్రశాంతి నీతో బాటే వుంటుంది. కాబట్టి మైక్రో ట్రాన్స్మిటర్ గా అబద్ధమాడిన రేకుముక్కలు నీ దుస్తులకు తగిలించడం పెద్ద సమస్య కాలేదు. ప్రశాంతి మీద నామీదా నువు నియోగించిన మాధవ్ను తప్పించు కోవడం కూడా మాకు కష్టం కాలేదు.

తర్వాతి రోజు 614870 నుండి నీకు వచ్చిన ఉత్తరం మాకు కనిపించింది. ఎక్స్ఛేంజ్లో దర్యాప్తుచేసి అడ్రసు పట్టుకున్నాం. టెలిఫోన్ స్తంభంమీద 6148"9 ఫోన్ని టాప్ చేశాను. అతడికీ నీకూ జరిగిన టెలిఫోన్ సంభాషణ విన్నాను.

ప్రణవ్ గార్డెన్స్లో నీకోసం సాయంకాలం నుండి కాచుక్కూర్చున్నాను. ఫోటోలు తీశాను. మొత్తం 60 ఫోటోలు!

నువు యింటికీ వచ్చేసరికి నీ కోసం ఫోన్ చేశాను.

నేరాలను కనిపెట్టే యంత్రం నిజంగానే నా దగ్గర వున్నట్టు నీకు రూఢి అయింది. నువు యంత్రం కొనడానికి

సిద్ధపడ్డావు. నేను పెట్టే మానసిక హింసకు తట్టుకోలేక పోయావు.

టూయిన్ ఒన్ కోసం నువు నా వెంబడిపడ్డావు.

నిజానికి 35 ఎం. ఎం. ఫిలిం నెగెటివ్వూ, పోజిటివ్వూ కలగలిపి నిన్ను బుట్టలో వేశాను. చిన్న అమరికతో టెలివిజన్ స్క్రీన్ మీద రూళ్ళ గీతలు వెళ్ళడం దృశ్యం పడటం చేశాను.

ఈ పనులకి అంతాకలసి మాకు ఏడువేల రూపాయలు ఖర్చయాయి. అంతే! కాని దానితో ప్రశాంతి (శాంత) నీమీద పగసాధించింది. తన తండ్రిని చంపినవాడిని, చంపించినవాడినీ తుదముట్టిస్తోంది.

ఈ సమయానికి అక్కడ శ్రీపతి చస్తాడు. నీ పిస్తోలుతోనే. పిస్తోలూ నీ ఆనవాళ్ళూ శవం దగ్గర దొరుకుతాయి.

అక్కడ నువ్వు....

ఈ గదిలో అమర్చిన టైంబాంబుకు బలయిపోతావు. స్ప్రింగ్ తెగిన పావుగంటకి టైంబాంబు పేలుతుంది. నిముషాలు లెక్క పెట్టు. —రామానంద."

అంతే! అది చదివి నిశ్చేష్టుణ్ణైపోయాను. నా తెలివి తక్కువకు, అత్యాశాకు నన్ను నేనే నిందించుకున్నాను.

నాకు చేతులు వణుకుతున్నాయి.

అలారం టిక్ టిక్ మంటోంది ఎక్కడో.

నా మరణం కొన్ని నిముషాలలో....క్షణాలలో.... క్షణాలు లెక్క పెడుతున్నాను.

నా గుండెల చప్పుడు నాకే వినిపిస్తోంది—అలారం మోతలాగా.

—:ఐ పో యి ం ది:—